చేర్యాలలో రాస్తారోకో చేస్తున్న బంధువులు, నాయకులు

కల్వర్టును ఢీకొని యువకుడి మృతి

-న్యాయం చేయాలని సీపీఐ, బంధువుల రాస్తారోకో

చేర్యాల, మే 14: జనగామ, సిద్దిపేట జాతీయ రహదారిలోని తాడూరు క్రాసింగ్ సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టును ఢీకొని సోమవారం రాత్రి ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని ఆకునూరుకు చెందిన ఎండీ.యాకూబ్ పాషా(29) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్ పై సిద్దిపేటకు వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కల్వర్టు వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లనే ప్రమాదం జరిగి లారీ డ్రైవర్ మృతి చెందాడని, ఆయన కుటుంబాన్ని అదుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని జాతీయ రహదారిపై కుటుంబ సభ్యులు, లారీ డ్రైవర్లతో కలిసి సీపీఐ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కుటుంబానికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

మిరుదొడ్డిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయం

మిరుదొడ్డి, మే 14: ప్రజల ఆశీర్వాదంతో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, మాజీ సర్పంచ్ బాల్‌రాజు, పార్టీ మండల సీనియర్ నాయకుడు లింగం అన్నారు. మంగళవారం మిరుదొడ్డిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల్లో ఎన్ని కవ్వింపు చర్యలకు పాల్పడినా బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఓర్పుతో ఉంటూ వెంకట్రామిరెడ్డి గెలుపునకు కృషి చేశారన్నారు. కేసీఆర్‌పై నమ్మకం ఉంచి కారు గుర్తుకు ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కమలాకర్ రెడ్డి, కిష్టయ్య, మల్లేశం, బైరయ్య, మల్లయ్య, ఐలయ్య, దుర్గారెడ్డి, బాబు, కనకయ్య, పాల్గొన్నారు.

చిన్నారులు భేష్..

కానుగ కాయలు సేకరిస్తున్న చిన్నారులు

హుస్నాబాద్‌టౌన్, మే 14: సెలవులను వృథాచేయకుండా చిట్టిచేతులు సంపాదిస్తున్నాయి. హుస్నాబాద్ పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు శివారు ప్రాంతంలో కానుగ కాయలు పొగుచేసే పనికి శ్రీకారం చుట్టారు. చదువుకు డబ్బులు ఉపయోగపడుతాయనే ఆలోచనతో ఈ పనిని చేస్తున్నారు. కానుగ కాయలు కిలో ఆరువై రూపాయలకుపైగా ఉండటంతో సరదాగా వేసవి సెలవులను గడుపుతూనే కానుగకాయలను సేకరించి డబ్బులు సంపాదిస్తున్నారు.

లారీ మీద లారీ

లారీ మీదకు ఎక్కిన మరో లారీ

చేర్యాల, మే 14: పట్టణ సమీపంలో పార్కింగ్ చేసి ఉన్న ఓ లారీపై అదే దారిలో వస్తున్న మరో లారీ ఎక్కింది. పట్టణంలోని జాతీయ రహదారిలో పార్కింగ్ చేసి ఉన్న సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసే లారీని గమనించకుండా అదే దారిలో ప్రయాణిస్తున్న మరో లారీ సోమవారం రాత్రి ఢీకొట్టి పైకి ఎక్కింది. కాగా ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగకపోగా రెండు లారీలు దెబ్బ తిన్నాయి.

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్

గజ్వేల్, మే 14: మండల పరిధిలోని జాలిగామ గ్రామానికి చెందిన కోయడ నీరజ మూడు రోజుల క్రితం అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో మృతి చెందింది. చిన్న వయస్సులో మృతిచెందిన నీరజ కుటుంబ సభ్యులను మంగళవారం ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గౌటి భిక్షపతి అనారోగ్యంతో బాధపడుతుండగా అతన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త మాచపురం స్వామిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ రావు, మాజీ సర్పంచ్ శివయ్య, మండల ప్రధాన కార్యదర్శి పాల రమేశ్‌గౌడ్, బాల్‌నర్సయ్య, రాజేశ్వర్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు

పల్లె శయన

గజ్వేల్, మే 14: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో ఈ విద్యా సంవత్సరం ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలలో చదువుతున్న పల్లె శయన 487/500 మార్కులు సాధించి జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ ఇన్నారెడ్డి తెలిపారు. పాఠశాలలో నూర్ సహస్రవర్షిణి, 466, యశస్విని 459మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వర్గల్‌లో..

వర్గల్, మే14: సీబీఎస్‌ఈ బోర్డు ఫలితాల్లో వర్గల్ నవోదయ విద్యార్థులు టెన్త్, 12వ తరగతి ఫలితాల్లో సత్తాచాటారు. 2023-24 వార్షికపరీక్షలకు సంబంధించి 10వ తరగతిలో మొత్తం 74 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. 12వ తరగతిలో 33 మంది విద్యార్థులకు 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు నవోదయ ప్రిన్సిపాల్ డి.రాజేందర్ తెలిపారు. 12వ తరగతిలో విద్యార్థినులు మేఘనాసౌమ్య 500 మార్కులకు 450 మార్కులతో ప్రథమస్థానం, ఎల్.యాదగిరి 448 మార్కులతో ద్వితీయ స్థానం,10వ తరగతిలో అనిమేశ్దాస్ 500/478, ఎం.సింధు 500/476 ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచారు. టెన్త్ తెలుగు పరీక్షలో విద్యార్థిని కీర్తన 100/100 మార్కులు సాధించింది. ఈసందర్భంగా అధ్యాపక, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ రాజేందర్ అభినందించారు.

డిగ్రీలో చేరాలంటే దోస్త్ కట్టాల్సిందే..

- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి
- ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు షురూ..
- అందుబాటులో దోస్త్ వెబ్‌సైట్, దోస్త్ మొబైల్ యాప్
- మూడు విడతల్లో అడ్మిషన్ల ప్రవేశాల ప్రక్రియ
- జూలై 7తో అడ్మిషన్లు పూర్తి.. 8 నుంచి తరగతులు ప్రారంభం
- జిల్లాలో ఏడు డిగ్రీ కళాశాలలు.. 560 సీట్లు
- ఈ నెల 25 వరకు తొలి విడత గడువు

దోస్త్ వెబ్‌సైట్ ఫొటో

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సిద్దిపేట టౌన్, మే 14 : రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కోర్సులో చేరాలంటే 'దోస్త్' కట్టాల్సిందే. డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల పారదర్శకత కోసం 2016 నుంచి రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)ను అందుబాటులోకి తెచ్చింది. దీనికి సంబంధించి 2024-25 సంవత్సరానికి నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్రంలో నచ్చిన యూనివర్సిటీ పరిధిలో కళాశాలలను ఎంపిక చేసుకుని అడ్మిషన్ పొందేందుకు చక్కటి దిక్సూచి 'దోస్త్'. తొలి విడుత అడ్మిషన్లకు ఈ నెల 6నుంచి ఈ నెల 25 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. మూడు విడుతల్లో జరిగే అడ్మిషన్ల ప్రక్రియ జూలై 7తో ముగియనుంది. ఆ వెంటనే తొలి సెమిస్టర్ తరగతులు జూలై 8 నుంచి ప్రారంభమవుతాయి. విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌తోపాటు దోస్ మొబైల్ యాప్‌లో కూడా ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలో ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.జిల్లా కేంద్రం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1560, సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలలో 240, గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో 560, బాలుర కళాశాలలో 480, చేర్యాలలో 240,దుబ్బాకలో 240, హుస్నాబాద్‌లో 240 మొత్తం 3560 సీట్లు ఉన్నాయి. అంతేకాకుండా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ సంవత్సరం నూతనంగా బీఏ పబ్లిక్ ఫైనాన్స్ కోర్సులో 60, బీకాం ఫైనల్‌లో 60, బీఏ హెచ్‌ఈపీలో 60 సీట్లు ప్రారంభమయ్యాయి.ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతోపాటు తత్సమాన కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ ఆయా కోర్సులో చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్ చేసుకోండిలా...

దోస్త్‌తో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలో ప్రవేశం పొందే అవకాశం ఉంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి దోస్త్‌తో సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. విద్యార్థులు తమ ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాల్సి ఉంటుంది. http://dost.cgg.gov.in వెబ్‌సైట్‌లోగానీ DOST మొబైల్ యాప్‌లోగానీ లాగిన్ కాగానే దోస్త్ ఐడీ, పిన్ నంబర్ వస్తుంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు విద్యార్థులు రూ. 200 క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలి. వీటిని ఉపయోగించి దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. ఓపెన్ అయిన సైట్‌లో యూనివర్సిటీ, కళాశాలల వారీగా ప్రాధాన్యత క్రమంలో కోర్సుల ఎంపిక, వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలి. కోరుకున్న కళాశాలలో సీటు వస్తే సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా కన్ఫర్మేషన్ చేసుకోవాలి. ఏ దశ కౌన్సిలింగ్‌లో అయినా సెల్ఫ్ రిపోర్టింగ్ ఎంచుకున్న కళాశాలకు వెళ్లి అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు చూపించాలి. వారు అక్కడ అడిగిన సర్టిఫికెట్స్‌ను అందజేసి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

కళాశాలల ఎంపిక ఇలా..

విద్యార్థి ఏ కళాశాలలో, ఏ గ్రూప్‌లో చేరదల్చుకున్నాడో వాటిని ప్రాధాన్యత ప్రకారం ఎంపిక చేసుకోవాలి. ఎన్ని కళాశాలల్లో ఆ విద్యార్థికి సంబంధించిన కోర్సు ఉంటుందో వాటిని నమోదు చేసుకోవాలి. కళాశాలలు, గ్రూప్స్ ఎంపిక పూర్తి కాగానే సేవ్ బటన్ నొక్కితే వెంటనే సేవ్ అయిపోతుంది. అప్పుడు ఏ కళాశాలల్లో దరఖాస్తు చేసుకున్నామో అందుకు సంబంధించిన పత్రాలు జనరేట్ అవుతాయి. వాటిని ప్రింట్ తీసుకోవచ్చు.

ముఖ్యమైన తేదీలు ఇవే..

- డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లకు ఫేజ్ -1 ఈ నెల 6 నుంచి 25 వరకు అవకాశం
- ఈ నెల 15 నుంచి 27 వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్స్
- జూన్ 3న వెబ్ ఆప్షన్ ఇచ్చిన విద్యార్థులకు తొలి విడుత సీటు అలాట్‌మెంట్
- జూన్ 4 నుంచి 10 వరకు అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో (కళాశాల ఫీజు, సీటు రిజ్వరేషన్ ఫీజు చెల్లించి) చేరడానికి ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి.
- జూన్ 4నుంచి 13 వరకు రూ. 400 చెల్లించి రెండో ఫేస్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్, వెబ్ ఆప్షన్స్
- జూన్ 4 నుంచి 14వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్స్
- జూన్ 18న రెండో లిస్టులో సీటు అలాట్‌మెంట్ వివరాలు విడుదల
- రెండో లిస్టులో సీటు వచ్చిన విద్యార్థులు జూన్ 19 నుంచి 24 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలి
- జూన్ 19నుంచి 25 వరకు మూడో విడుత రూ. 400 చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 19 నుంచి 26వరకు వెబ్ ఆప్షన్స్
- జూన్ 29న ఫైనల్ (మూడో విడుత) సీటు అలాట్‌మెంట్ విడుదల
- చివరి లిస్టులో సీటు వచ్చిన విద్యార్థులు జూన్ 29 నుంచి జూలై 3వరకు ఆయా కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాలి.
- ఫేజ్ 1, 2, 3లో సీటు వచ్చి ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటు నమోదు చేసిన విద్యార్థులు జూన్ 29నుంచి జూలై 5లోగా ఆయా కళాశాలలో చేరడానికి అవకాశం
- జూలై 1 నుంచి 6వరకు డిగ్రీలో చేరిన విద్యార్థులకు ఆయా కళాశాలలో ఓరియంటేషన్ ఉంటుంది.
- జూలై 8నుంచి సెమిస్టర్ -1 తరగతులు మొదలవుతాయి.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలో డిగ్రీలో చేరడానికి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన విద్యార్థులంతా దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దోస్త్ అడ్మిషన్లలో సందేహాల కోసం ప్రత్యేక హైల్ప్ లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో ఏమైనా తప్పులు జరిగితే వర్సిటీ హెల్ప్‌లైన్ సెంటర్‌కు వచ్చి సవరణ చేసుకునే అవకాశం ఉంది.

-డాక్టర్ ప్రసాద్, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఉచిత సేవలు అందిస్తున్నాం

దోస్త్ ద్వారా డిగ్రీలో అడ్మిషన్లు పొందే విద్యార్థులకు ఉచిత సేవలు అందిస్తు న్నాం. జిల్లా వ్యాప్తంగా ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో అన్ని రకాల మౌలిక వసతులతోపాటు నిపుణులైన అధ్యాపకులు ఉన్నారు.

- శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం

మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

సిద్దిపేట, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన ఐదు రోజుల భత్యం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నందుకు అమానుషంగా పోలీసులతో లాఠీచార్జి చేయించడాన్ని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజేందర్‌రెడ్డి, మల్లికార్జున్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయంగా తమకు రావాల్సిన వేతన భత్యాలు ఇవ్వాలని అడిగిన వారిపై పోలీసు బలగాలను ప్రయోగించడం అత్యంత దారుణమన్నారు. ఈ ఘటనకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లాఠీచార్జి చేయించడం దారుణం

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రావాల్సిన రెమ్యునరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించడాన్ని టీఎస్ యూటీఎఫ్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ వలి అహ్మద్, తప్పిడ యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యునరేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో అమలు చేయకుండా తక్కువ భత్యాన్ని ఇవ్వడంపై ప్రశ్నించిన ఉపాధ్యాయులపై విచక్షణారహితంగా లాఠీచార్జి చేయించడం దారుణమన్నారు.

జగదేవ్‌పూర్‌లో...

జగదేవ్‌పూర్, మే 14: నారాయణఖేడ్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యునరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతోలాఠీచార్జి చేయించడాన్ని టీఎస్ యూటీఎఫ్ సంఘం తీవ్రంగా ఖండించింది. ఘటనకు కారణమైన ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్‌కిరణ్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలోని మెదక్, నర్సాపూర్, గజ్వేల్ పీవో, ఏపీవోలకు రూ. 3150 చెల్లించగా నారాయణఖేడ్‌లో రూ. 2400 మాత్రమే చెల్లించినట్లు తెలిపారు. ఒకే పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గంలో రెమ్యునరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీవో ఆదేశాలతో ఉపాధ్యాయులపై పోలీసులు లాఠీచార్జి చేసి గాయపర్చారన్నారు. నిబంధనలు పాటించకుండా ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేయించిన ఆర్డీవో, పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు శివుడు, ప్రధాన కార్యదర్శి రాజనర్సింహులు, జిల్లా నాయకులు రామచంద్రం కృష్ణ, ప్రవీణ్ డిమాండ్ చేశారు.

మజ్జిగ వితరణ కేంద్రం ప్రారంభం

సిద్దిపేటలో మజ్జిగ వితరణ చేస్తున్న అలయన్స్ క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్,మే 14 : సిద్దిపేట అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుభాష్ రోడ్,భారత్‌నగర్,శుభోదయ పాఠశాల వద్ద మంగళవారం మజ్జిగ వితరణ కేంద్రాలను అలయన్స్ క్లబ్ గవర్నర్ బాలచంద్రం ప్రారంభించారు. గందెసిరి కృష్ణమూర్తి, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆత్మరాములు సుజాత పాల్గొన్నారు.

పాఠశాలలో స్వర్ణమృత ప్రాశన

అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ బాలచంద్రం ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో స్వర్ణమృత ప్రాశన సంస్కారంలో భాగంగా మంగళవారం 6నెలల చిన్నారుల నుంచి 12 నెలల పిల్లలకు చుక్కల మందు వేశారు.ఈ సందర్భంగా బాలచంద్రం కృష్ణమూర్తులు మాట్లాడుతూ.. ప్రాశన సంస్కారం వేసుకోవడం ద్వారా చిన్నారుల్లో జ్ఞాపక శక్తి, జ్ఞానం తదితర ఉపయోగాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్, ఆత్మరాములు, భారతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతర టెండర్ ఇప్పించండి

ఆలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

హుస్నాబాద్, మే 14: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకాఎల్లమ్మ దేవాలయం జాతరలో కోళ్లు, గొర్రెల టెండర్ తమకే అప్పగించాలని కోరుతూ హుస్నాబాద్‌కు చెందిన వెంకటేశ్వర్ రజక సహకార సంఘం సభ్యులు మంగళవారం ఆలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. జాతరలో ప్రతియేటా కోళ్లు, గొర్రెలను కోసే టెండర్‌ను రజక కులస్తులకు మాత్రమే ఇచ్చేవారని, ఈ సంవత్సరం ఇతరులకు కేటాయించడం వల్ల ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తమకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏండ్ల తరబడి తాము చేస్తున్న వృత్తిని తమకు కాకుండా చేయడం సరికాదని, వెంటనే ఇతరులకు కేటాయించిన టెండర్‌ను రద్దు చేసి రజకులకు అప్పగించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం సభ్యులు పున్న సారయ్య, వరుకోలు రాజు, పున్న రమేశ్, మైసయ్య, బాలయ్య, శ్రీనివాస్, కుమార్, రాజయ్య ఉన్నారు.

మల్లయ్యను పరామర్శిస్తున్న ప్రతాప్‌రెడ్డి

బీఆర్‌ఎస్ కార్యకర్తకు ప్రతాప్‌రెడ్డి పరామర్శ

గజ్వేల్, మే 14: అనారోగ్యంతో దవాఖానలో చికిత్సపొందుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తను ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మంగళవారం పరామమర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని సింగారం గ్రామానికి చెందిన గుడూరు మల్లయ్య ప్రజ్ఞాపూర్‌లోని అతిథి దవాఖానలో చికిత్సపొందుతున్న విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి పరామర్శించారు.

ఆకట్టుకుంటున్న హరితహారం చెట్లు

ఎర్రనిపూలతో ఆకట్టుకుంటున్న హరితహారం చెట్లు

హుస్నాబాద్, మే 14: 'ఈ దారిపూల దారి... పోవోయి బాటసారి' అని ఓ కవి పాటరాసిన చందంగా కనిస్తోంది హుస్నాబాద్ పట్టణం నుంచి గాంధీనగర్ వెళ్లే రహదారి. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కలల పథకం అయిన తెలంగాణకు హరితహారంలో నాటిన మొక్కలు నేడు పెరిగి పెద్దయి చెట్టునిండా పూలుపూసి బాటసారులను ఆకట్టుకుంటున్నాయి. ఈ దారిన పోయే వాళ్లు అక్కడ కాసేపుఆగి పూల అందాలను చూసి తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.

- ఇక మున్సిపల్ కార్యాలయం

ముగిసిన బ్లాక్ ఆఫీస్ శకం

శిథిలావస్థకు చేరిన బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యాలయ భవన నిర్మాణం తొలగింపు

హుస్నాబాద్‌టౌన్, మే 14: దాదాపు ఆరువై ఏండ్ల కిందట నిర్మించిన హుస్నాబాద్ పట్టణంలోని బ్లాక్ ఆఫీసు శకం ఇక ముగిసింది. ఇకనుంచి మున్సిపల్ కార్యాలయంగా మారనున్నది. పంచాయతీ రాజ్‌వ్యవస్థలో భాగంగా ఆనాటి ప్రభుత్వం 1959లో బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు ఏర్పాటు చేసింది. వాటినే పంచాయతీ సమితులుగా పిలిచేవారు. హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి, బెజ్జంకి, మానకొండూర్ మండలాలకు చెందిన దాదాపు 60 గ్రామాలతో కూడినదే పంచాయతీ సమితి. ఆయా గ్రామాల నుంచి సర్పంచ్‌లుగా ఎన్నికైన వారు సమితి అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. హుస్నాబాద్ పట్టణంలో కరీంనగర్ రోడ్‌లో దాదాపు ఆరు ఎకరాల విశాలమైన విస్తీర్ణంలో 1962-63 సంవత్సరం ఈ బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యాలయ భవనం ప్రథమ అధ్యక్షుడు బొప్ప రాజు లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో నిర్మాణం జరిగింది. దాదాపు ఇరువై ఏండ్లపాటు సాగిన పంచాయతీ సమితులను స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు అధికారంలోకి వచ్చిన తర్వాత మండలాల వ్యవస్థకు అంకురార్పణ చేశారు. దీంతో బ్లాక్ ఆఫీసుల వ్యవస్థ తొలిగిపోయి మండల ప్రజా పరిషత్ కార్యాలయాలుగా ఏర్పడ్డాయి.

శిథిలమైన బ్లాక్ ఆఫీసు భవనం తొలిగింపు

దాదాపు ఆరువై ఏండ్లకిందట నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో మండల ప్రజాపరిషత్‌కు నూతన భవనాన్ని నిర్మించారు. శిథిలావస్థకు సమీపంలోనే మున్సిపల్ నూతన కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టారు. 2022లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణం దాదాపు తుదిదశకు చేరుకుని ప్రారంభానికి సిద్ధమైంది. నూతన మున్సిపల్ భవనానికి సమీపంలోనే ఈ శిథిలమైన భవనం ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో అధికారులు ఇటీవల దీన్ని తొలగించాలని నిర్ణయించారు. ఈభవనం తొలిగింపుపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేయడం, ఫిర్యాదుల వరకు వెళ్లినప్పటికీ అధికారులు తొలిగింపుకే మొగ్గుచూపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బ్లాక్‌డెవలప్‌మెంట్‌కార్యాలయ భవనాన్ని ఎంపీడీవో, ఆర్ అండ్‌బీఈఈ, డీఈల సమక్షంలో తొలిగించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ వివరించారు.

అడ్మిషన్లు ప్రారంభం షురూ..

రాజన్న

జగదేవ్‌పూర్, మే14: జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న మంగళవారం తెలిపారు. 50 ఏండ్ల క్రితం కళాశాల ప్రారంభించిన నాటి నుంచి మండలంలోని చుట్టుపక్కల గ్రామాల పేద విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఈటీ(ఒకేషనల్) తెలు గు, ఇంగ్లిష్ మీడియం కోర్సులు ఉన్నాయన్నారు. ఉచిత విద్య, స్కాలర్‌షిప్‌తో పాటు ప్రభుత్వం అందిస్తున్న అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 30 వరకు కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.